


Digital, tmedia.net.in

# టీ-మీడియా

TMEDIA 11వ వార్షికోత్సవం 2016 - 2026 మీ ఆదరణ... మా ప్రేరణ... ధన్యవాదాలు!

ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 200
సంచిక : 300
పేజీలు : 4

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

బుధవారం, జులై 01, 2026

## డమ్మీ అభ్యర్థితో పరీక్ష రాయించిన ఇద్దరికి జైలు శిక్ష

**టి మీడియా, జూన్ 30, కొత్తగూడెం లీగల్:** పదో తరగతి పబ్లిక్ పరీక్షలో అసలు అభ్యర్థికి బదులుగా మరొకరితో పరీక్ష రాయించిన కేసులో ఇద్దరు నిందితులకు జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీ కె. సాయి మంగళవారం తీర్పు వెలువరించారు.కేసు వివరాల ప్రకారం, 2019 నవంబర్ 4న నిర్వహించిన పదో తరగతి సోషల్ స్టడీస్ పబ్లిక్ పరీక్ష సందర్భంగా కొత్తగూడెంలోని లిటిల్ బర్డ్స్ పాఠశాలలో నిర్వహించిన తనిఖీల్లో, అసలు అభ్యర్థి తెల్లం అనిల్ స్థానంలో పూనెం సందీప్ పరీక్ష రాస్తున్నట్లు స్క్వాడ్ అధికారులు గుర్తించారు. హాల్ టికెట్‌ను పరిశీలించి అక్రమం జరిగినట్లు నిర్ధారించిన అనంతరం, పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కుసుమ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు అప్పటి కొత్తగూడెం టౌన్ ఎస్సై పి. రామయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం సేకరించిన ఆధారాలతో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు.విచారణ సందర్భంగా ప్రాసిక్యూషన్ సమర్పించిన సాక్ష్యాధారాలు,

3లో

# ఎరువుల గోడౌన్లు, విక్రయ కేంద్రాలు తనిఖీ

**టీ మీడియా,జూన్ 30 ,చింతకాని :**జిల్లాలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. జిల్లాలోని అన్ని సహకార సంఘాల గోడౌన్లలో, సేల్ పాయింట్లలో యూరియా నిల్వలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా పర్యవేక్షణ చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లాకు 18832.34 మెట్రిక్ టన్నుల యూరియా చేరుకోగా, పాత నిల్వలను కలుపుకొని 24903.7 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో వచ్చిందన్నారు. ఇప్పటి వరకు 6071.13 మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకం అయినట్లు కలెక్టర్ అన్నారు. మంగళవారం చింతకాని మండలం లోని నాగులవంచ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఎరువుల గిడ్డంగులు, విక్రయ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోడౌన్లలో నిల్వ ఉన్న యూరియా, ఇతర ఎరువులను పరిశీలించి, స్టాక్ వివరాల రిజిస్టర్ లో పొందుపరచిన వాటికి అనుగుణంగా నిల్వలు అందుబాటులో ఉన్నాయా లేదా అని పరిశీలించారు. ఇప్పటివరకు ఎన్ని ఎరువుల బస్తాలు వచ్చాయి, ఎన్ని పంపిణీ చేశారు, ఇంకనూ ఎంత పరిమాణంలో నిల్వలు





రావాల్సి ఉంది తదితర వివరాలను వ్యవసాయశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. యూరియా బుకింగ్ యాప్ పనితీరును కలెక్టర్ స్వయంగా రైతుల మొబైల్ ఫోన్ లో పరిశీలన చేసి యాప్ వల్ల సమకూరే ప్రయోజనాలను రైతులకు వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి, వానాకాలం సీజన్ పంటల సాగుకు అవసరమైన మేరకు పూర్తి స్థాయిలో ఎరువుల నిల్వలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని, యూరియ లభ్యత పై రైతులు ఆందోళనకు గురి కావద్దని సూచించారు. మన రాష్ట్రంలో అమలు అవుతున్న యూరియా బుకింగ్

3లో



## పేదల ఇళ్ల స్థలాల కోసం కలెక్టరేట్ తరలండి

### నల్లు సుధాకర్ రెడ్డి సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు



**టిమీడియా, జూన్ 30 ,కురవి:** పేదల ఇళ్ల స్థలాల,ఇందిరమ్మ ఇండ్ల కోసం జూలై 1న కలెక్టరేట్ కు పెద్ద ఎత్తున తరలిరావాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి పిలుపు నిచ్చారు. కొరివి మండల కేంద్రంలోని పార్టీ కార్యలయంలో సిపిఐ మండల కార్యవర్గ సమావేశం జరగగా సుధాకర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వమని చెప్పుకునే రేవంత్ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు లేని పేదలు ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు వేసుకుంటే నిర్ధాక్షిణ్యంగా కూల్చివేయడం దారుణమని, భూ కబ్జాదారు లు విలువైన భూములను కాజేసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించి ప్రభుత్వ పెద్దలు నిలువ నీడలేని పేదలు గుడిసెలు వేసుకుంటే రాత్రికి రాత్రి కూల్చి వేసే విధానానికి వెంటనే స్వస్తి చెప్పాలని, ఇళ్ల స్థలాలు లేని పేదలకు స్థలాలు,పట్టాలు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇండ్లను ఏకపక్షంగా ఎన్నిక చేసే విధానాన్ని ఆపాలని, అధికారులే అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ జులై 1న జరిగే కలెక్టరేట్ ధర్నా జయప్రదం చేయడానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు .జులై 5 6 7 న తొర్రూరు పట్టణశీలో జరిగే పార్టీ జిల్లా స్థాయి రాజకీయ సైద్ధాంతిక శిక్షణాలి తరగతులకు పార్టీ, ప్రజా సంఘాల నాయకత్వం పాల్గొనాలని కోరారు .ఈ సమావేశంలో సిపిఐ సీనియర్ నాయకులు బుడమ వెంకన్న కొరవి పట్టణ కార్యదర్శి తురక రమేష్, బుర్ర సమ్మయ్య, దూదికట్ల సారయ్య,కలగురు నాగరాజు, నిలుగొండ నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## రైతాంగంసమస్యలను పరిష్కరించాలి



**టీ మీడియా, జూన్ 30, దమ్మపేట :** రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, యూరియా యాప్ ను రద్దు చేయాలని, కౌలు రైతులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ దమ్మపేట తాసీల్దార్ కార్యాలయం వద్ద ఏఐయూకేఎస్ శ్రేణులు మంగళవారం నిరసన తెలిపి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తాసీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకురాలు తోడం దుర్గమ్మ, అఖిల భారత ఐక్య రైతు సంఘం డివిజన్ అధ్యక్షుడు పండూరి వీరబాబు మాట్లాడుతూ.. ఖరీఫ్ ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు లభించడం లేదన్నారు. అరకొరగా కురిసిన వర్షానికి విత్తిన విత్తనాలు మొలవక రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు.రైతులు యూరియా యాప్ ద్వారా యూరియా, డీఏపీ కాంప్లెక్స్ ఎరువులు సకాలంలో అందడం లేదన్నారు. ఒకే దఫాలో రైతు భరోసా చెల్లించాలని, గత బకాయిలను కూడా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ధాన్యం అమ్మిన రైతాంగానికి బిల్లులు, బోనస్ తక్షణమే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మండల కార్యదర్శి కురసం ముత్యాలరావు, అఖిల భారత ఐక్య రైతు సంఘం మండల అధ్యక్షుడు కుంజా కాంతారావు, మండల నాయకులు పూజల సంజీవరావు, భద్రం, సున్నం జగన్, శీలం రాంబాబు, గంగాధర నాగమణి, కుప్పాల నాగరాజు, రాజేశ్వరి పాల్గొన్నారు.

## ఎరువుల గోడౌన్లు, విక్రయ కేంద్రాలు తనిఖీ

యాప్ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా ఎరువుల పంపిణీ కోసం అమలు చేస్తున్నాయని, ఈ యాప్ వల్ల ఎలాంటి నష్టం లేదని, గత రబీ సీజన్లో కూడా రైతులకు ఇబ్బందులు లేకుండా అమలు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఎరువులు పక్కదారి పట్టకుండా, పారదర్శకంగా, ప్రణాళికాబద్ధంగా యూరియా పంపిణీకి బుకింగ్ యాప్ దోహదపడుతుందని, దీని విషయంలో రైతులు అపోహలకు గురి కావద్దని సూచించారు. జిల్లాతో పాటు మీ మండలంలో ఉన్న స్టాక్ వివరాలు కూడా యాప్ లో తెలుస్తాయని తెలిపారు. అదేవిధంగా యూరియా కు ప్రత్యామ్నాయ గా నానో యూరియా వాడకం వల్ల కలిగే లాభాలపై రైతులకు అవగాహన ఉండాలన్నారు. ప్రయోగాత్మకంగా కొంత పరిమాణంలో నానో యూరియాను వినియోగించి ఫలితాలను స్వయంగా పరిశీలించాలని రైతులకు సూచించారు. రైతులను నానో యూరియా కొనాలని డీలర్లు, బలవంతం చేయవద్దని, వారు కోరిన ఎరువులు మాత్రమే అందించాలని, ఇతర ఉత్పత్తులు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. రైతులు పంటల అవసరంమేరకు మాత్రమే మోతాదుకు మించకుండా ఎరువులు, క్రిమిసంహారక మందులు వినియోగించే విధంగా, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా సహకార శాఖ అధికారి గంగాధర్, చింతకాని మండల తహసీల్దార్ కిలారి బాబ్జీ, ఎంపీడీవో శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డమ్మీ అభ్యర్థితో పరీక్ష

పత్రాలను పరిశీలించిన కోర్టు నిందితులపై అభియోగాలు రుజువయ్యాయని నిర్ధారించింది.దీంతో, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ మాల్ ప్రాక్టీసెస్ అండ్ అన్‌ఫెయిర్ మీన్స్) చట్టం, 1997లోని సెక్షన్ 8 కింద మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5,000 జరిమానా, అలాగే సెక్షన్ 419 ఐపీసీ కింద ఒక సంవత్సరం జైలు శిక్ష విధించింది. ఈ రెండు శిక్షలను ఏకకాలంలోఅనుభవించాలని కోర్టు తన తీర్పులో పేర్కొంది.ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నార్సింగ్ అనిల్ కుమార్ వాదనలు వినిపించగా, కోర్టు నోడల్ అధికారి ఎస్సై డి. రాఘవయ్య (కోర్టు డ్యూటీ ఆఫీసర్), డి. కామేశ్వరరావు సమన్వయం అందించారు.

# వన్ టైమ్ సెటిల్ మెంట్ కు రెండు రోజులే గడువు

**-ఐటీడీఏ పిఓ. శుభం నొక్వాల్ .**

**టీ మీడియా,జూన్30,చింతూరు:**చింతూరు, కూనవరం, వి.ఆర్. పురం మండలాల గిరిజనయేతర ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు (పిడిఎఫ్ ) ఆప్షన్ మార్పునకు చివరి రెండు రోజుల అవకాశం కల్పించారు.పోలవరం ప్రాజెక్టు పునరావాసం, పునరస్థాపన (ఆర్ డఆర్ ) కార్యక్రమం కింద

చింతూరు, కూనవరం, వి.ఆర్. పురం మండలాల అర్హులైన గిరిజనయేతర ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు (పిడిఎఫ్) ప్రస్తుతం ఎంపిక చేసిన ఆప్షన్-1 లేదా ఆప్షన్-2 నుండి ఆప్షన్-3 (వన్ టైమ్ సెటిల్‌మెంట్ -- ఒకేసారి నగదు పరిహారం) కు మార్పు చేసుకునేందుకు బుధవారం, గురువారం మాత్రమే చివరి రెండు రోజుల అవకాశం కల్పించారు .ఇప్పటికే ఆప్షన్-1 లేదా ఆప్షన్-2 ఎంచుకున్న అర్హులైన గిరిజనయేతర ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు ఆప్షన్-3 (వన్ టైమ్ సెటిల్‌మెంట్ -- ఒకేసారి నగదు పరిహారం)ను ఎంచుకోవాలనుకుంటే, తమ సవరించిన ఆప్షన్ ఫారాన్ని సంబంధిత ఆర్ డ ఆర్ అధికారికి స్వయంగా సమర్పించాలన్నారు .లబ్ధిదారుల సౌకర్యార్థం ఐటీడీఏ, చింతూరులో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయబడింది. అవసరమైన పత్రాలతో హెల్ప్ డెస్క్‌కు హాజరై తమ ఆప్షన్ మార్పు ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చునని పేర్కొన్నారు..ఈ అవకాశం కేవలం ఆప్షన్-1 లేదా ఆప్షన్-2 నుండి ఆప్షన్-3 (వన్ టైమ్ సెటిల్‌మెంట్) కు మార్పు చేసుకోవడానికి మాత్రమే వర్తిస్తుంది. ఇతర ఏ విధమైన ఆప్షన్ మార్పులను పరిగణనలోకి తీసుకోబడవని పేర్కొన్నారు .గురువారం సాయంత్రం 6:00 గంటలలోపు తమ సవరించిన ఆప్షన్ ఫారాలను సంబంధిత ఆర్ డ ఆర్ అధికారికి లేదా ఐటీడీఏ, చింతూరులో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ వద్ద స్వయంగా సమర్పించవలసిందిగా కోరారు.




## ఆపరేషన్ ముస్కాన్-12 వాల్ పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్

**టిమీడియా, జూన్30, కురవి:**మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో "ఆపరేషన్ ముస్కాన్--12" కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ఐపీఎస్ ఆవిష్కరించారు.సమావేశంలో పోలీసు శాఖతో పాటు మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, ప్రత్యేక బృందాల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ఐపీఎస్ మాట్లాడుతూ, జూలై 1 నుంచి జూలై 31 వరకు జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ ముస్కాన్--12 కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాల కార్మికులుగా పనిచేస్తున్న చిన్నారులను, ఇటుక బట్టీలు, హోటళ్లు, పరిశ్రమలు, వర్క్‌షాప్‌లు తదితర ప్రాంతాల్లో పనిచేస్తున్న బాలలను, భిక్షాటన చేస్తున్న చిన్నారులను, అలాగే తప్పిపోయిన పిల్లలను గుర్తించి రక్షించి వారి తల్లిదండ్రులు లేదా సంరక్షకుల వద్దకు చేర్చడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.జిల్లాలో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేసి బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, హోటళ్లు, పరిశ్రమలు, ఇటుక బట్టీలు, ప్రధాన కూడళ్లు తదితర ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేపట్టాలి.ఈ ఆపరేషన్‌లో పాల్గొనే అన్ని ప్రభుత్వ శాఖలు పరస్పర సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.బాలలను కార్మికులుగా నియమించుకునే యజమానులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.తప్పిపోయిన చిన్నారులను త్వరితగతిన గుర్తించేందుకు పోలీసు శాఖ ఆధునిక ఫేషియల్ రికగ్నిషన్ సాంకేతికతతో కూడిన డాఆర్పాన్ ను వినియోగిస్తోందని తెలిపారు.ప్రజలు తమ పరిసరాల్లో బాల కార్మికులు, భిక్షాటన చేస్తున్న చిన్నారులు లేదా తప్పిపోయిన పిల్లల సమాచారం తెలిసిన వెంటనే



సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా సంబంధిత అధికారులకు తెలియజేసి "ఆపరేషన్ ముస్కాన్--12" కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగస్వాములు కావాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ గంద్రతి మోహన్, ఇన్స్పెక్టర్ హతిరం,సబ్ ఇన్‌స్పెక్టర్లు, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారులు, కార్మిక శాఖ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మరియు ఆపరేషన్ ముస్కాన్ ప్రత్యేక బృంద సభ్యులు పాల్గొన్నారు.

# ఆహార నాణ్యత, వసతులపై ప్రత్యేక దృష్టి

**జిల్లా కలెక్టర్ అంకిత్**

**టీ మీడియా, జూన్ 30 ,జూలూరుపాడు :**మండలం జూలూరుపాడు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల మరియు కళాశాల, జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, కళాశాలను సందర్శించి కంప్యూటర్ ల్యాబ్, తరగతి గదులను పరిశీలించారు. ఏడో, ఎనిమిదో తరగతి విద్యార్థినులతో మాట్లాడి వారికి అందుతున్న విద్యా సౌకర్యాలు, వసతి, భోజనం తదితర అంశాలపై ఆరా తీశారు. పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థుల వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థినుల ఔటింగ్ రిజిస్టర్‌ను తనిఖీ చేసిన కలెక్టర్, బాలికలను తల్లిదండ్రులు లేదా అధికారికంగా అనుమతించిన సంరక్షకులతో మాత్రమే బయటకు పంపాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం కిచెన్ షెడ్‌ను పరిశీలించి విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. స్టోర్‌రూమ్‌లో నిల్వ ఉంచిన సరుకులను పరిశీలించారు.అనంతరం కిచెన్ షెడ్‌ను పరిశీలించి విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. స్టోర్‌రూమ్‌లో నిల్వ ఉంచిన సరుకులను తనిఖీ చేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్.ఓ. ప్లాంట్ మరమ్మతులు ఆలస్యమవుతున్న కారణాలను అడిగి తెలుసుకుని, వెంటనే మరమ్మతులు పూర్తి చేసి విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు.అనంతరం జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, పాఠశాలలో నమోదైన విద్యార్థుల సంఖ్య, హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన సందర్భంగా పప్పు పలుచగా ఉండటంతో పాటు నాణ్యత లోపించిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు వడ్డించే ఆహారం పరిశుభ్రంగా, పోషక విలువలతో, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని సూచించారు. తాను మళ్లీ ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, ఆహార నాణ్యతలో లోపాలు పునరావృతమైతే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం అత్యంత ముఖ్యమని అన్నారు.



విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. తాగునీరు, పరిశుభ్రత, మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లపై ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు మరింత విశ్వాసం కలిగేలా విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, పరిశుభ్రత, పోషకాహార నాణ్యతను మరింత మెరుగుపర్చాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు . ఈ పర్యటనలో కలెక్టర్ వెంట తాసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో తాళ్లూరి రవి,ఎంఈఓ జుంకీలాల్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.